క్లుప్తంగా

సన్మానం



సంగెం : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్‌ఎన్‌గా సేవలు అందించిన ఉద్యోగ విరమణ పొందిన ఉపేంద్రను డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.సాంబశివరావు, ఉద్యోగులు, సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో డీఎంహెచ్‌ఓ సాంబశివరావు మాట్లాడారు. ఉద్యోగులు విధులను అంకితభావంతో నిర్వహిస్తే తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొమురయ్య, డాక్టర్ ప్రకాశ్, వైద్యాధికారి డాక్టర్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

మత ప్రచారంపై ఫిర్యాదు



వర్ధన్నపేట : పుస్కోస్ స్కూల్‌లో మత ప్రచారం చేశారంటూ స్థానిక ఏసీపీ కార్యాలయంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం వర్ధన్నపేట శాఖ అధ్యక్షుడు అజయ్ మాట్లాడారు. స్కూల్‌లో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి మత ప్రచారం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు చర్చి ఫాదర్‌తో ప్రార్థన నేర్పించడం నిబంధనకు విరుద్ధమని స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పుస్కోస్ స్కూల్ యాజమాన్యంపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బొల్ల అజయ్, అరుణ్, లోకేశ్, తదితరులు పాల్గొన్నారు.

యాదవులు రాణించాలి

ఖానాపురం : యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని యాదవ సంఘం బాధ్యులు ఆబోతు అశోక్‌యాదవ్, భూషబోయిన రాజు ఆకాంక్షించారు. మండలంలోని ధర్మరావుపేటలో మంగళవారం నిర్వహించిన సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. యాదవ కులస్తులు అగ్రకుల నాయకుల చేతిలో కీలుబొమ్మలు మారవద్దన్నారు. జాతి శ్రేయస్సు కోసం కులస్తులందరూ ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ రిజర్వేషన్ పెంపు కోసం పోరాడాలని సూచించారు. సమావేశంలో నాయకులు పులిగిల్ల యాదగిరి, దేవేందర్, సాయిలు, వల్లె శ్రీనివాస్, కిషన్, అశోక్, ప్రభాకర్, ఉపేందర్, రాజు, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



రాయపర్తి : మండలంలోని సన్నూరు మాజీ సర్పంచ్ కుందూరు భీష్మారెడ్డి ఇటీవల మృతి చెందగా ఆయన కుమారుడైన విక్రమ్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, టి.రాజేశ్వర్ రావు, వన్నాల శ్రీరాములు, తదితర పలువురు ప్రముఖులు మంగళవారం పరామర్శించారు. తొలుత భీష్మారెడ్డి చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏకశిల హాస్పిటల్స్ చైర్మన్ కుందూరు కరుణాకర్ రెడ్డి, నాయకులు డాక్టర్ వన్నాల వెంకటరమణ, గాడిపెల్లి రాజేశ్వర్‌రావు, ఏకాంతం, కేయూ దూరవిద్య ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శాగంటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పానిశ్‌తండాలో..

రాయపర్తి : మండలంలోని పానిశ్‌తండాకు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బానోతు లాలూనాయక్ సతీమణి కైక మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. కైక చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, నాయకులు ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, చిన్నాల లక్ష్మీ నారాయణ, భద్రునాయక్, బిచ్చునాయక్ తదితరులు పాల్గొన్నారు.

'ఇనగాల'కు డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలి

ఆత్మకూరు : 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డికి డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని యూత్ కాంగ్రెస్ నాయకులు ఏఐసీసీ పరిశీలకుడు నవజ్యోతి పట్నాయక్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతి, యూత్ కాంగ్రెస్ ఆత్మకూరు మండల అధ్యక్షుడు సందీప్, దామెర మండల అధ్యక్షుడు సుధాకర్, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శులు రాజు, శ్రవణ్, రాజు, ఉపాధ్యక్షుడు, సొసైటీ డైరెక్టర్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ రాజేందర్ తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లేక వెతలు

● 300 ఎకరాల్లో మొక్కజొన్న సాగు

పర్వతగిరి : మండలంలో మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాల్లేకపోవడంతో మొక్కజొన్న పండించిన రైతులకు పంట విక్రయంలో వెతలు తప్పడం లేదు. మండలంలోని పర్వతగిరి, ఏనుగల్లు, చింతనెక్కొండ, అన్నారం, రావూరు, కొంకపాక, చౌటపల్లి, తదితర గ్రామాల్లో రైతులు ఈ ఏడాది సుమారు 300 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం రూ.2400కు క్వింటా మొక్కజొన్న కొనుగోలు చేస్తున్నప్పటికీ మండలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారులకు రూ.1900కే క్వింటా అమ్ముకుంటూ ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం, సంబంధిత శాఖ ఉన్నతాధికారులు మండంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం విఫలమయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆరుగాలం శ్రమించి పండించిన మొక్కజొన్న పంటను దళారులకు విక్రయిస్తున్న పరిస్థితుల్లో క్వింటాపై దాదాపు రూ.500 చొప్పున నష్టపోతూ కనీసం పెట్టుబడి కూడా గిట్టుబాటు కావడం లేదని రైతులు వేదనకు గురౌతున్నారు.

చిన్న, సన్నకారు రైతులకు భారీ నష్టం

మండలంలో మొక్కజొన్న పండించిన వారిలో సన్న, చిన్నకారు రైతులే ఎక్కువగా ఉన్నారు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో రూ.2400 మద్దతు ధర మండలంలోని మొక్కజొన్న రైతులకు అందని ద్రాక్షే అయ్యింది. ముఖ్యంగా మండలంలోని చిన్న, సన్నకారు రైతులు దళారులకు అమ్ముకుంటూ భారీగా నష్టపోతున్నారు. ఇకనైనా ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మండలంలో మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.



ఏనుగల్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న మక్కలు

తక్షణమే ఏర్పాటు చేయాలి



మండలంలో తక్షణమే మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. దళారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో ఆలస్యం చేస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం స్పందించి అధికారులను ఆదేశించాలి.

- గంధం బాలరాజు, రైతు, ఏనుగల్

దళారులతో భారీ నష్టం



మొక్కజొన్న పంట దళారులకు విక్రయించాల్సి వస్తుండడంతో సన్న, చిన్నకారు రైతులకు భారీగా నష్టపోతున్నారు. పండించిన కొద్దిపాటి పంటను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లలేక స్థానిక దళారులకు తక్కువ ధరకు అమ్మాల్సి వస్తోంది. దళారులను నియంత్రించి మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

- బొట్ల వెంకన్న, రైతు, పర్వతగిరి

చింతలపల్లికి తరలనున్న గూడ్స్ షెడ్



చింతలపల్లి రైల్వేస్టేషన్‌లో కొత్తగా నిర్మించిన వ్యాగన్ ట్రాక్, ప్లాట్‌ఫారం

● వ్యాగన్ ప్లాట్‌ఫారం నిర్మాణం పూర్తి

సంగెం : మండలంలోని రైల్వేస్టేషన్‌లో త్వరలో గూడ్స్ షెడ్ ఏర్పాటు కానుంది. ఈ మేరకు వరంగల్ జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లోని గూడ్స్ షెడ్‌ను చింతలపల్లి రైల్వేస్టేషన్‌కు తరలించడానికి అధికారులు గతంలోనే నిర్ణయించారు. ప్రస్తుతం గూడ్స్ షెడ్ వరంగల్‌లో ఉండడంతో తలెత్తుతున్న ట్రాఫిక్, ఇతర సమస్యలను అధిగమించే దిశగా వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి రైలు మార్గంలో కేవలం 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న చింతలపల్లి రైల్వేస్టేషన్‌కు తరలించడానికి అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. రోడ్డు మార్గంలోనూ కేవలం 16 కిలోమీటర్ల దూరమే కావడంతో రైల్వే అధికారులు ఈ మేరకు నిర్ణయించినట్టు సమాచారం. రైల్వే గూడ్స్ షెడ్‌ను అధికారికంగా చింతలపల్లిలో ప్రారంభించడానికి రైల్వే శాఖ ఉన్నతాధికారులు ఆమోదం తెలుపుతూ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ జారీ చేశారు. చింతలపల్లి వద్ద ఇప్పటికే వ్యాగన్ నిలపడానికి ట్రాక్, సరుకుల ఎగుమతి, దిగుమతులకు అవసరమైన ప్లాట్‌ఫారం నిర్మాణం పూర్తి చేశారు. సరుకుల తాత్కాలిక నిలువ షెడ్లు, కార్యాలయ నిర్వహణకు గదులు నిర్మించాల్సి ఉంది. రైల్వే గూడ్స్ షెడ్ రైల్వే స్టేషన్‌లో వస్తువులను తాత్కాలికంగా నిల్వ చేయడానికి, నిర్వహించడానికి ఉపయోగించే నిర్మాణం కావడం తెలిసిందే. సాధారణంగా రైళ్ల నుంచి ఆహార ధాన్యాలు, సిమెంట్, ఎరువులు, ఆటోమొబైళ్ల సరుకులను అన్‌లోడ్ చేయడంతోపాటు ఆహార ధాన్యాలు, ఇతరత్రా సరుకులు లోడ్ చేయడానికి ఉపయోగిస్తుంటారు.

పెరగనున్న ఉపాధి

చింతలపల్లి రైల్వేస్టేషన్‌కు గూడ్స్ షెడ్ తరలిరావడంతో స్థానికులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని తెలుస్తోంది. రైల్వే ఫ్లెఓవర్ బ్రిడ్జి నిర్మాణం కూడా తుది దశకు చేరుకోవడం గమనార్హం. వరంగల్ జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న చింతలపల్లి రైల్వేస్టేషన్‌కు గూడ్స్ షెడ్ రావడంతో సమీపంలోనే ఆసియా ఖండంలోనే అతిపెద్దదైన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు అవసరమైన ముడి సరుకులు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవడానికి, అందులో ఉత్పత్తి అయిన వస్తువులు ఇతర రాష్ట్రాలకు తరలించడానికి మార్గం మరింత సులభం కానుంది.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

● ఎంజీఎంకు క్షతగాత్రుల తరలింపు

ఖిలా వరంగల్ : రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలైన ఘటన వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై ఆర్‌టీఏ జంక్షన్ సమీపంలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మామునూరు నుంచి వరంగల్ దిశగా వెళ్తున్న ఆటోను మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ అతివేగంగా నడుపుతూ ముందు వెళ్తున్న మరో ఆటోతోపాటు బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో సదరు ఆటో బోల్తా పడింది. పమాదంలో ఇద్దరు ఆటోడ్రైవర్లతోపాటు ఇద్దరు ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారుడు తీవ్ర గాయాల పాలయ్యారు. క్షతగాత్రులు పర్వతగిరి మండలంలోని చింతనెక్కొండకు చెందిన కుడికాల వర్షిత, హనుమకొండ శివారులోని గుండ్లసింగారం ప్రాంతానికి చెందిన గుగులోత్ రాజేందర్ ఆటో ప్రయాణికులు కాగా ద్విచక్ర వాహనదారు బురాన్‌పల్లికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కొప్పుల మహేందర్, వర్ధన్నపేట మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బర్ల రవి, గణేష్‌నగర్ కాలనీకి చెందిన మరో ఆటోడ్రైవర్ భూక్య తిరుపతిగా తెలిసింది. స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంలో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మామునూరు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సీసీ కెమెరాలను పరిశీలించి విచారణ చేపట్టారు.



ప్రమాదానికి గురైన ఆటోలు, బైక్

అదృష్టాన్ని పరీక్షించుకోండి..!

రూ.500లకే 108 గజాల పెంకుటిల్లు

● లక్కీ డ్రాలో పాల్గొనాలని ప్రచారం

● సోషల్ మీడియాలో వైరల్

నర్సంపేట : పట్టణ నడిబొడ్డున 108 గజాల స్థలంలో ఓ పాత పెంటిళ్లుతో ఉంది. స్థలం విలువ గజం రూ.వేలల్లో ఉంటుంది. అదృష్టాన్ని పరీక్షించుకోండి.. లక్కీ డ్రాలో 108 గజాల స్థలాని గెల్చుకోవచ్చని, రూ.500లకే కూపన్ అంటూ సోషల్ మీడియా వేదికపై చేసిన ప్రచారం మంగళవారం వైరల్‌గా మారింది. కేవలం 3 వేల కూపన్లు మాత్రమే విక్రయిస్తామని, డ్రాలో గెలిచిన వారే రిజిస్ట్రేషన్ ఖర్చులు భరించాల్సి ఉంటుందని, జనవరి 15వ తేదిన కొత్తగూడ మండలంలోని గుంజేడులోని ముసలమ్మ ఆలయంలో డ్రా తీస్తామని పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది. ఏది ఏమైనా ఖరీదైన పెంటింటిని రూ.500లకే ఎవరు దక్కించుకుంటారో? వేచి చూడాల్సిందే.



లక్కీడ్రాలో పెట్టిన పెంకుటిల్లు

వరిలో ఆకుపచ్చ తెగులును నివారించాలి

దామెర : వరిలో సంక్రమించే అకుపచ్చ తెగులును నివారించాలని ఏఓ రాకేశ్ రైతులకు సూచించారు. మండలంలోని పసరగొండలో మంగళవారం రైతులతో కలిసి వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల వలన వరిలో బ్యాక్టీరియా, ఆకుపచ్చ తెగులును గమణించినట్లు చెప్పారు. దీంతో ఆకుల చివర నుంచి కింది వరకు పసుపు పచ్చగామారి తెగులు సోకిన బాగాలు ఎండిపోతాయని అన్నారు. ఈ వ్యాధి సోకితే సుమారు 80శాతం పంట నాశనం అవుతుందన్నారు. దీని నివారణకు స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ 90 శాతం, టెట్రాసైక్లోహైడ్రోక్లోరైడ్ 10 శాతం, 0.2 గ్రాములు, మాస్టర్‌కాప్ 400 ఎంఎల్ ఒక ఎకరానికి 200లీటర్ల నీటిలో కలిపి పచికారీ చేయాలని సూచించారు. 10 నుంచి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. ఏఈఓ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గాలికుంటు నివారణ టీకాల పంపిణీ

నెక్కొండ/ఖానాపురం/సంగెం/పర్వతగిరి : పశువులకు నేటి నుంచి గాలికుంటు నివారణ టీకా వేస్తామని నెక్కొండ, ఖానాపురం, సంగెం, పర్వతగిరి మండలాల పశు వైద్యాధికారులు మమత, శ్రీలక్ష్మి, వల్లె రాజు, రాజు తెలిపారు. వచ్చే నెల 14వ తేదీ వరకు గ్రామాల్లో పశు వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. పాడి రైతులు ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, ఇతర పశువులకు టీకాలు వేయించి గాలికుంట వ్యాధి బారి నుంచి కాపాడుకోవాలని, వైద్యశిబిరాలను వినియోగించుకోవాలని కోరారు.

లక్షణాలివే : డాక్టర్ మమత



నెక్కొండ : గాలికుంటు వ్యాధి లక్షణాల ను, తీసుకోవాల్సిన జాగ్రత్తల ను నెక్కొండ పశు వైద్యాధికారి మమత మీడియాకు వెల్లడించారు. గాలికుంటు వ్యాధి బారిన పడిన పశువుల నోటి నుంచి చొంగ కారుతుందని, పశువు ఉష్ణోగ్రత 104 నుంచి 108 డిగ్రీల వరకు ఉంటుందని తెలిపారు. నోటిలో పుండ్లు ఏర్పడి మేత సరిగ్గా తీసుకోక నీరస పడతాయని చెప్పారు. పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుందన్నారు. అలాగే దూడల్లో వ్యాధి లక్షణాలు కనిపించగానే పశు వైద్యులను సంప్రదించాలని కోరారు. 6 నుంచి 8 వారాల పైబడిన దూడలకు వ్యాధి నివారణ వ్యాధి నిరోధక టీకా మొదటి మోతాదు వేయాలని, 4 నుంచి 6 నెలల వయసు కలిగిన దూడలకు బూస్టర్ మోతాదు ఇప్పించాలని తెలిపారు. ఏటా టీకా వేయిస్తే వ్యాధి నివారణకు అవకాశం ఉందన్నారు. వ్యాధి బారిన పడిన పశువును మంద నుంచి వేరు చేయాలని, పశువుల కొట్టంతోపాటు పరిసరాలు శుభ్రంగా ఉంచాలని పాడిరైతులకు సూచించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



భాస్కర్ (ఫైల్)

ఖిలా వరంగల్ : పట్టాలు దాటుతున్న వ్యక్తి రైలు ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఎలుగూరు-చింతలపల్లి రైల్వేస్టేషన్ల మధ్య చోటు చేసుకుంది. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి కథనం ప్రకారం.. సంగెం మండల కేంద్రానికి చెందిన గుండేటి భాస్కర్ (38) తాపీ మేస్త్రీగా పని చేస్తూ గేదెలు సాకుతున్నాడు. మంగళవారం ఉదయం గేదెలకు పచ్చిగడ్డి తెచ్చేందుకు రైలు పట్టాలు దాటుతుండగా జోధ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు భాస్కర్‌ను ఢీకొట్టంది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య మౌనిక, ఇద్దరు పిల్లలున్నారు.మృతదేహాన్ని మృతుడి తల్లి యాకలక్ష్మికి అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

నిరసన



గీసుకొండ : శ్రీరాం సాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) 2వ దశకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, ఎంసీపీఐ(యూ) పొలిట్‌బ్యూరో సభ్యుడు భీంరెడ్డి నర్సింహారెడ్డి (బీఎస్) పేరు పెట్టాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ మండల నాయకులు మండలంలోని కోనాయమాకుల సమీపంలోని కాకతీయ కెనాల్ వద్ద మంగళవారం నిరసన తెలిపారు. రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పేరును ఉపసంహరించాలని నినాదాలు చేశారు. నాయకులు సంధ్య, సురేశ్, సుధాకర్, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేవీపీఎస్ ఆవిర్భావం



ఐనవోలు : మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మంగళవారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) 28వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గబ్బెట రామ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సంపత్ కేవీపీఎస్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఏ దేశంలో లేని కుల వివక్ష భారత దేశంలోనే ఉందన్నారు. ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన లక్ష్యసాధనతో సంఘం ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో వృత్తి సంఘాల నాయకులు కాడబోయిన లింగయ్య, ఆలకుంట మల్లయ్య, మాదాసి యాకుబ్, శ్రీనివాస్, యాకయ్య, ఎల్లయ్య, అనిల్, కనకరాజు, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

పత్తికి మద్దతు ధర రూ.8,110

● మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య



వర్ధన్నపేట : ప్రభుత్వ రంగ సంస్థ అయిన సీసీఐ 2025-26 సంవత్సరానికి గాను పత్తి క్వింటా మద్దతు ధర రూ.8110గా నిర్ణయించిందని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య కోరారు. పట్టణంలో మంగళవారం మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని చెప్పారు. పత్తి పంటను నేరుగా సీసీఐకి విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు. జిన్నింగ్ మిల్లుకు తీసుకెళ్లే ముందే వ్యవసాయ శాఖ అధికారులతో పత్తి పంట సాగు చేసినట్టు రికార్డుల్లో నమోదు చేయించాలని, అనంతరం కిసాన్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. స్లాట్ బుక్ చేసుకున్న రైతుల పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. పత్తిని ఆరబెట్టి తేమ శాతం 12లోపు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేసి తీసుకెళ్లాలని చెప్పారు. మద్దతు ధర లభించాలంటే పత్తి తేమ 8 నుంచి 12 శాతం లోపు ఉండాలన్నారు. 8 శాతానికి తక్కువగా ఉంటే ఒక్కో శాతం పెరిగే కొద్ది క్వింటాకు రూ.61 వరకు ధర తగ్గుతుందన్నారు. 12 శాతానికి మించిన తేమ ఉన్న పత్తిని సీసీఐ కొనుగోలు చేయదని తేటతెల్లం చేశారు. జిన్నింగ్ మిల్లుకు పత్తి విక్రయానికి వెళ్లేప్పుడు రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుబుక్కు జిరాక్సులతోపాటు బ్యాంకు ఖాతాకు లింకు అయిన సెల్ నంబరు తీసుకెళ్లాలని తెలిపారు. పత్తి కొనుగోలుకు సంబంధించి సేవలపై టోల్ ఫ్రీ నంబరు 18005995779 లేదా వాట్సాప్ నంబరు 8897281111 ద్వారా మరింత సమాచారం తెలుసుకోవచ్చని వివరించారు.

అంగన్‌వాడీ సేవలను వినియోగించుకోవాలి

● డాక్టర్ శ్రావణ్, ఏపీఎం ఝాన్సీ



నర్సంపేట : సమావేశంలో మాట్లాడుతున్న శ్రావణ్

నర్సంపేట : గర్భిణులు, బాలింతలు, తల్లులు, ఐదేళ్లలోపు చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో లభిస్తున్న సేవలను వినియోగించుకోవాలని డాక్టర్ శ్రావణ్, ఐకేపీ ఏపీఎం ఝాన్సీ, మహిళా బ్యాంకు అధ్యక్షురాలు పెండెం రాజేశ్వరి కోరారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా నర్సంపేట-2 అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని పాఖాల మహిళా బ్యాంకులో మంగళవారం పోషణ సంబరాలు, నషాముక్త్ భారత్ అభియాన్ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణ్, ఏపీఎం ఝాన్సీ, బ్యాంకు అధ్యక్షురాలు రాజేశ్వరి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, తల్లులు, ఐదేళ్లలోపు చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నట్టు తెలిపారు. ఆటపాటలతో చిన్నారుల సంపూర్ణ అభివృద్ధికి తోడ్పాటు అందుతోందన్నారు. మత్తు పదార్థాల నిర్మూలనలో సమాజంలోని ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా కోఆర్డినేటర్ పావని డ్రగ్స్‌పై ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మహిళా బ్యాంకు లీగల్ అడ్వైజర్ పెండెం శివానంద్, సూపర్‌వైజర్ మాధవి, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి, ప్రాజెక్టు అధ్యక్షురాలు గొర్రె రాధ, ఏఎస్ఎం సునీత, ఆశావర్కర్లు మంజుల, ఇమ్మడి పద్మ, కీసరి విజయ, రంజిత్, అంగన్‌వాడీ యూనియన్ మండల అధ్యక్షురాలు దాసరి రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

కాల్‌నాయక్‌తండాలో..

నర్సంపేట రూరల్ : చెన్నారావుపేట మండలంలోని కాలనాయక్‌తండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, తల్లులు, చిన్నారులకు పౌష్టికాహారం, చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అంగన్‌వాడీ టీచర్ కుంద రాహుల్ వార్ అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందుతున్న సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, అంగన్‌వాడీ ఆయా సాంకీ, తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

● బీజేపీ ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

దుగ్గొండి : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మహ్మదాపురం, ముద్దునూరు, పొనకల్ గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థులుగా పోటీ చేయడానికి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో యువతీ యువకులు బీజేపీ వైపు చూస్తున్నారని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేయడానికి యువత ముందుకు రావాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి అనేక పథకాలు, కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను, కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని చెప్పారు. పోటీ చేసే అభ్యర్థులు, శ్రేణులు సమన్వయంతో పని చేయాలన్నారు. పార్టీ అభ్యర్థుల గెలుపునకు నాయకులు, కార్యకర్తలు పట్టుదలతో పని చేయాలని కోరారు. సమావేశాల్లో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నర్సింహరాములు, మహబూబాబాద్ పార్లమెంట్ కోకన్వీనర్ రాంచంద్రారెడ్డి, ఎస్సీ మోర్చా నాయకులు కూనమల్ల పృథ్వీరాజ్, కౌన్సిల్ మెంబర్ రాజు, పార్టీ మండల అధ్యక్షుడు నేదురు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

'ఐక్యపోరాటాలతో సమస్యల పరిష్కారం'



సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

నర్సంపేట : ఐక్యపోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఏఐసీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర కుమారస్వామి తెలిపారు. స్థానిక ఓంకార్ భవన్‌లో ఐరన్ హార్డ్‌వేర్, ఫ్లైవుడ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పాశం రాజిరెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశానికి కుమారస్వామి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మిక హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తూ లేబర్ కోడ్‌లుగా మార్చి కార్పొరేట్ సంస్థలకు, పెట్టుబడిదారులకు లబ్ధి చేకూర్చుతోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ తప్పుడు విధానాలతో ఎనిమిది గంటల పని విధానం, కనీస వేతనాలు, ఇతర ప్రయోజనాలు అమలు కావడం లేదన్నారు. కార్మిక శాఖ నిర్లక్ష్యంతో షాపుల్లో పని చేస్తున్న కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఇకనైనా షాపుల్లో పని చేసే కార్మికులకు హక్కులు, చట్టాలను అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఐక్యంగా హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని కోరారు. సమావేశంలో సంఘం గౌరవ సలహాదారు మహ్మద్ మాషుక్, ప్రధాన కార్యదర్శి కుడుతాల రాజు, కోశాధికారి సముద్రాల అశోక్, ఉపాధ్యక్షుడు ముత్యాల భద్రయ్య, నాయకులు శ్రీను, శ్రావణ్, మల్లయ్య, మణి, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

'హామీల అమలులో ప్రభుత్వం విఫలం'

దామెర : ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయ్యిందని బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు మెంతుల రాజు అన్నారు. మండలంలోని పులుకుర్తిలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ బాకీకార్డుపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. హామీలు నెరవేర్చని కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం సాధించడం ఖాయమని అన్నారు. అందుకు కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముదిగొండ కృష్ణమూర్తి, గోవిందు అశోక్, ఎడ్ల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.